ప్రజాశక్తి
సోమవారం 5 ఫిబ్రవరి 2024

నేటి నుంచి ప్రజా సైన్స్ కళాజాతా

ప్రజాశక్తి-వీరఘట్టం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు చేపట్టే ప్రజాసైన్స్ కళాజాతాను జయప్రదం చేయాలని వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.గౌరినాయుడు, ఎస్.మహేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని నడుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 6న మంగళవారం పాలకొండలోని వివేకానంద పాఠశాలలో కళాజాతా ప్రదర్శన ఉంటుందని తెలిపారు. సైన్స్‌పై నాటికలు, గీతాలపన, మ్యాజిక్ ప్రదర్శన, ప్రయోగాలు, నృత్య రూపకాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు బిఎం గౌరీశ్వరరావు, సిహెచ్ గోవర్ధన్ పాల్గొన్నారు.

లక్ష్యం చేరని ఆయిల్‌పామ్

- రాయితీలను అందుకోలేకపోతున్న రైతులు
- నీటి వసతి కల్పించకపోవడమే కారణం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దేశంలో ఆయిల్ పామ్ సాగుకు ఆంధ్రప్రదేశ్ పెట్టింది పేరు. అందులోనూ మన జిల్లాలో దీని సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాగుకు అనుగుణమైన సారవంతమైన మెట్ట భూములు మన రాష్ట్రంలో ఉండడమే ఇందుకు కారణం. ఈనేపథ్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు, తద్వారా ఆయిల్ డిమాండ్‌ను తగ్గించుకునేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది మన రాష్ట్రానికి కాస్తంత ఎక్కువ లక్ష్యం విధించినప్పటికీ, ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనుకబడి ఉంది. ఆయిల్ పామ్ సాగుకు నిరంతరం నీరు అందుబాటులో ఉండాల్సివుంటుంది. లేదంటే భారీ నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అత్యధికంగా భూగర్భజలాలు ఉండడంతోపాటు బోర్లు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా ఆయిల్ పామ్ సాగవుతుంది. విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో నాగావళి, వంశధార, చంపావతి, వేగావతి, సువర్ణముఖి, గోముఖి వంటి నదీపరివాహక ప్రాంతాల్లోనూ సాగు ఉంది. ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 60వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం విధించగా, స్థిరమైన నీటి లభ్యత లేని కారణంగా లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనుకబడింది. కేవలం 42వేల ఎకరాలు మాత్రమే సాగు విస్తీర్ణం పెరిగింది. ఇందులోనూ ఎక్కువగా భాగం కోనసీమ, ఏలూరు, పార్వతీపురం మన్యం తదితర జిల్లాల్లోనే కనిపిస్తోంది. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో తక్కువగా పెరిగింది.

వాస్తవానికి ఆయిల్ పామ్ లాభసాటి వాణిజ్యపంట. చీడపీడ సమస్య అనేది ఉండనే ఉండదని ఉద్యాన వనశాఖ అధికారులు చెబుతున్నారు. సాగుకు అనుగుణమైన మెట్ట ప్రాంతంలో పుష్కలమైన నీటి వనరులు ఉంటే ఆదాయానికి కొదవలేనట్టే. దీనికితోడు మొక్కలు మొదలుకుని, సాగు, అంతర్‌పంటల వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ఇన్‌పుట్ సబ్సిడీ కల్పించాయి. ఒక 2.5ఎకరాల్లో స్వదేశీ మొక్కలు నాటితే 2,1000, విదేశీ మొక్కలకు 29వేలు చొప్పున ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలే ఇన్‌పుట్ సబ్సిడీలు అందిస్తాయి. ఇలా ఒక్కో రైతూ 37.5 ఎకరాల వరకు సబ్సిడీ పొందేందుకు అవకాశం ఉంది. 4ఏళ్ల సాగు సమయంలో ప్రతి 2.5 ఎకరాలకు ఏటా రూ.5,250 చొప్పున, అంతరపంటలకు మరో రూ.5,250 చొప్పున రాయితీ పొందేందుకు అవకాశం ఉంది. అంతకు మించి సారవంతమైన మెట్ట భూములు కూడా రాష్ట్రంలో అనేక చోట్ల ఉన్నాయి. కానీ, వాటికి నీటి వసతి మాత్రం లేదు. రాష్ట్రంలో జలసిరి బోర్ల పథకం ముందుకు సాగలేదు. గతంలో ఎపిఎంఐపి ద్వారా సబ్సిడీపై ఇచ్చే డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లు మచ్చుకు కూడా మంజూరు కాని పరిస్థితి. వర్షపునీరు కూడా నదుల ద్వారా సముద్రంలోకి పోవడం తప్ప జంఝావతి, తోటపల్లి, వంశధార వంటి ప్రాజెక్టులు పూర్తిచేయలేదు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు గత ఏడాది వరకు 4,375 ఎకరాల్లో ఉంది. ఈ ఏడాది కేంద్రం ఇచ్చిన లక్ష్యం ప్రకారం 1,845 ఎకరాల మేర పెంచాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 855 ఎకరాలు మాత్రమే పెరిగింది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ నీటి వసతి లేకపోవడం వల్ల లక్ష్యం చేరుకోవడంలో వెనుకబాటు కనిపిస్తోంది. నీటి వసతి అందుబాటులోకి తెస్తే ఆయిల్ పామ్ రైతులకు రూ.కోట్ల ఆదాయం సమకూరుతుందని రైతాంగం చెబుతోంది.

సాగునీటి వసతి లేకే లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం

సాగునీటి వసతి లేకే ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. జిల్లాలో నీటి వసతి ఉన్న అన్నిచోట్ల ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాం. కొన్ని నదుల్లో నీరు ఉన్నా అక్కడ ఆనకట్టలు, బోర్లు వంటివి లేవు. జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో బోర్లు కూడా తక్కువగానే ఉన్నాయి. బోర్లు ఉన్నచోట కూడా డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం లేదు. ఆయిల్‌పామ్ సాగుకు నీరే అత్యంత కీలకం. కనీసం 2.5 అంగులాల బోర్ నిరంతరం పారుతుండాలి.

- ఎవిఎస్‌వి జమదగ్ని, విజయనగరం జిల్లా ఉద్యాన శాఖ అధికారి

ఎన్నికల ముహూర్తం సమీపిస్తున్న తరుణంలో సాలూరు నియోజకవర్గంలో టిడిపిలో గ్రూపు రాజకీయాల కుంపటి మరింత రాజుకుంటోంది. కొద్దినెలల క్రితం వరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రూపు రాజకీయాలు ఇప్పుడు బుసకొడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి ఆర్‌పి భంజ్‌దేవ్ ఓటమికి సంధ్యారాణి రూ.2 కోట్లు తీసుకుని, వైసిపితో చేతులు కలిపారంటూ టిడిపి సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు సంచలన ఆరోపణ చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. ఎన్నికల ముందు ఇలాంటి వ్యాఖ్యలతో పార్టీలో గ్రూపు రాజకీయాలు చినికిచినికి గాలివానలా తయారయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

టిడిపిలో రెండు కోట్ల దుమారం

- నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణిపై సొంత పార్టీ నాయకులే ఆరోపణ
- నిరూపిస్తానంటున్న సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు
- బుసకొడుతున్న గ్రూపుల పోరు

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ గ్రూపుల మధ్య గత ఐదేళ్లుగా పొసగని పరిస్థితి నెలకొంది. తమను ఇన్‌ఛార్జి హోదాలో సంధ్యారాణి ఎన్నడూ కలుపుకు పోలేదని భంజ్‌దేవ్ గ్రూపు నాయకులు ఆరోపిస్తున్నారు. ఆమె ఒంటెద్దు పోకడల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని భంజ్‌దేవ్ అనేకసార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. అధిష్టానం కూడా ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా పరిస్థితి అలాగే ఉంది. మరో మూడు నెల్లలో ఎన్నికలు ఎదుర్కోనున్న తరుణంలో అభ్యర్థుల ఎంపికపై పార్టీ దృష్టి సారించడంతో ఇరు గ్రూపులు ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీగా ఉన్నారు. సంధ్యారాణికి సీటు ఇస్తే గెలుపు సాధ్యం కాదని ప్రత్యర్థి గ్రూపు నాయకులు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రూపునకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆమె విజయం కోసం పని చేయరనే సంకేతాలు పార్టీ పెద్దలకు పంపించారు. ఇలాంటి పరిస్థితుల్లో పాలకొండ నియోజకవర్గం వంగర మండలానికి చెందిన గిరిజన నాయకురాలు, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఎం.తేజోవతిని భంజ్‌దేవ్ గ్రూపు నాయకులు తెరపైకి తీసుకొచ్చారు. ఆమె టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేయడం, ప్రభుత్వ ఆమోదం, పార్టీలో చేరడం వంటి పరిణామాలు చకచకా జరిగిపోయాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణితోపాటు ఆశావహ నాయకురాలు తేజోవతి కూడా టికెట్ రేసులో ఉన్నారు. ఆమె చాపకింద నీరులా పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటూ సహకరించాలని అభ్యర్థిస్తున్నారు. ఇటీవల మక్కువ మండలంలో సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు సహకారంతో ఆయనకు పట్టున్న గ్రామాల్లో పర్యటించారు. తనకు మద్దతు ఇస్తారనుకుంటున్న నాయకులను రహస్యంగా కలుస్తున్నారు. సంధ్యారాణి కూడా తన అనుచరులతో కలిసి నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ప్రచారం చేసుకుంటున్నారు.

సంధ్యారాణిపై తీవ్ర ఆరోపణలు

కొద్దిరోజుల క్రితం సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావుపై టిడిపి మక్కువ మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్‌రావు విమర్శనాస్త్రాలు సంధించారు. దీనికి ప్రతిగా పెంట తిరుపతిరావు ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణిపై పదునైన ఆరోపణాస్త్రాన్ని సంధించడం ఇప్పుడు నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. గత ఎన్నికల్లో వైసిపి నుంచి సంధ్యారాణి రెండు కోట్ల రూపాయలు తీసుకుని పార్టీకి వెన్నుపోటు పొడిచారని పెంట తిరుపతిరావు ఆరోపించారు. ఈ ఆరోపణలను తాను నిరూపిస్తానని సవాల్ విసురుతున్నారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా భంజ్‌దేవ్ పోటీ చేశారు. ఆయన ఓటమికి సంధ్యారాణి వైసిపితో చేతులు కలిపారనే వాదనను పెంట తిరుపతిరావు ఎన్నికల ముందు తీసుకురావడం దుమారం రేపుతోంది. నియోజకవర్గంలో నెలకొన్న సంక్షోభాన్ని ఎలా నివారించాలనే దానిపై రాష్ట్ర నాయకత్వం తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది.

తేజోవతిలో చిగురిస్తున్న ఆశలు

టిడిపిలో నెలకొన్న తాజా పరిణామాలు తనకు లబ్ధిస్తాయనే ఆశతో తేజోవతి ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల శంబర పోలమాంబ జాతర సందర్భంగా తన ఫ్లెక్సీలను చించివేయడం వెనుక నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి అనుచరుల హస్తం ఉందనే విషయాన్ని ఆమె అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్‌తోపాటు బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన ఆశీస్సులు కూడా తేజోవతికి ఉండడంతో ఆమెకు అనుకూల పరిణామంగా భావిస్తున్నారు.

జనసేనకు జవసత్వాలు?

బలమైన కేడర్ ఉన్నప్పటికీ గ్రూపు రాజకీయాల కారణంగా పరస్పర ఆరోపణలతో రచ్చకెక్కుతున్న టిడిపి నాయకుల వ్యవహారాన్ని ఆ పార్టీ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తోంది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి గ్రూపు రాజకీయాలు చేరడంతో పార్టీ నాయకత్వం ప్రత్యామ్నాయ చికిత్సపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. పొత్తులో భాగంగా జనసేన పార్టీ స్థానిక ఎమ్మెల్యే సీటుని కోరుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక్కడి టికెట్ జనసేనకు కేటాయించినా ఆశ్చర్యపోనక్కర్లేదనే అభిప్రాయాన్ని కొంతమంది వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎన్.శ్వేత అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. శ్వేత తల్లిదండ్రులు రామారావు, శ్యామల, ఆశ్రమ పాఠశాల హెచ్‌డబ్ల్యు కథనం ప్రకారం.. నిమ్మక శ్వేత (14) స్వగ్రామం సాలూరు మండలం తుండ పంచాయతీ ఇటికివలస. స్వగ్రామంలో ఉంటున్న శ్వేతకు ఐదు రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో తల్లిదండ్రులు పార్వతీపురంలోని జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పించారు. అక్కడ నుంచి విజయనగరం, అనంతరం విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి శ్వేత మృతి చెందింది. శ్వేతకు కేన్సర్‌గా వైద్యులు నిర్ధారించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం స్వగ్రామం ఇటికివలసలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్వేత మృతి పట్ల ఆశ్రమ పాఠశాల హెచ్‌డబ్ల్యు స్వర్ణలతను వివరణ కోరగా, శ్వేత దసరా సెలవుల అనంతరం పాఠశాలకు రాలేదని చెప్పారు. పలుమార్లు పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరగా శ్వేతకు ఆరోగ్యం బాగోలేదని చెప్పడంతో డిసెంబర్‌లో సాలూరు సిహెచ్‌సిలో చేర్పించి ఐదు రోజులు చికిత్స అందజేసినట్లు తెలిపారు. శ్వేతకు రక్తం తక్కువగా ఉండటంతో సాలూరులో సిహెచ్‌సిలో బ్లడ్ ఎక్కించామన్నారు. చికిత్స అనంతరం పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరగా, బాగా నీరసం ఉందని, తగ్గాక పాఠశాలకు పంపిస్తామని చెప్పారని గుర్తుచేశారు. మధ్యలో పలుమార్లు పాఠశాలకు పంపించాలని ఫోన్ ద్వారా కోరామని తెలిపారు. విద్యార్థి మృతి సమాచారాన్ని ఎటిడబ్ల్యుకు చేరవేశామని చెప్పారు.

రహదారుల నిర్మాణంతో
ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి

మరింత అందుబాటులోకి విద్య, వైద్యం : డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-పాచిపెంట

ఏజెన్సీ ప్రాంతాల్లో పక్కా రహదారుల నిర్మాణంతో మైదాన ప్రాంతాలకు దీటుగా అభివృద్ధి చెందుతాయని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. గిరిజనులకు విద్య, వైద్యం మరింత అందుబాటులోకి వస్తాయన్నారు. ఆదివారం ఏజెన్సీ ప్రాంతాల్లో పలు రహదారులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మండలంలోని పద్మాపురం, కర్రివలస, ఆజూరు పంచాయతీల్లో రొడ్డవలస నుంచి కంకణపల్లి వరకు 1.7 కిలోమీటర్ల మేర రూ.1.35 కోట్లతో నిర్మిస్తున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎన్‌హెచ్ 43 నుంచి కరడవలస వరకు రూ.4.96 కోట్లతో నిర్మించిన ఏడు కిలోమీటర్ల రోడ్డు, ఆజూరు నుండి పందిరిమామిడి వలస వరకు రూ.2.24 కోట్లతో నిర్మించిన 3.8 కిలోమీటర్ల బిటి రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆజూరులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నాలుగు పంచాయతీలకు సంబంధించి సుమారు తొమ్మిది కోట్లతో రహదారుల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలో గత 20 రోజుల్లో 13 రహదారులు, వంతెనలకు ప్రారంభాలు, శంకుస్థాపనలు చేశామన్నారు. మరో మూడు రహదారులకు వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తామని చెప్పారు. రహదారుల నిర్మాణంతో ఏజెన్సీ ప్రాంతాల్లో పంటలను తరలించి, గిట్టుబాటు ధరకు విక్రయించవచ్చునని తెలిపారు. రోడ్లతోపాటు సెల్ టవర్లు ఎక్కడికక్కడే నిర్మించామని తెలిపారు. ఎమ్మెల్యేగా భంజ్‌దేవ్, ఎమ్మెల్సీగా సంధ్యారాణి.. గిరిజన ప్రాంతాలకు, గిరిజనులకు చేసిందేమీ లేదన్నారు. ఐదేళ్లకు ఒకసారి గ్రామాల్లో తిరిగి కల్లబొల్లి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి వస్తారని ధ్వజమెత్తారు. అటువంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, జెడ్‌పి వైస్ చైర్మన్ కె.సింహాచలం, వైస్ ఎంపిపిలు ఎం.నారాయణ, కె.రవీంద్ర, జి.ముత్యాల నాయుడు, డోల బాబ్జి, పి.వీరంనాయుడు, దండి శ్రీనివాసరావు, టి.గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్ అధ్యాపకుని పోస్టుకు గెస్ట్ ప్రాతిపదికన దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 8లోపు దరఖాస్తులను తమ కళాశాలలో సమర్పించాలని కోరారు. 9న ఉదయం 11 గంటల నుంచి కళాశాలలో డెమో క్లాసుకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. దీనికి అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. పిహెచ్‌డి చేసిన అభ్యర్థులు నెట్, స్లెట్ గల వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

పూర్ణపాడు-లాబేసు వంతెనపై
పాలకుల మౌనం ఎందుకో? : సిపిఎం

ప్రజాశక్తి-కొమరాడ

పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణ విషయంలో పాలకులు ఎందుకు మౌనం వహిస్తున్నారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. ఆదివారం అర్థాంతరంగా నిలిచిపోయిన వంతెన పనులను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పనిచేసినప్పుడు కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. పూర్ణపాడు- లాబేసు వంతెన సమస్య ఎన్నికల్లో ఓట్ల కోసమే తప్ప వంతెన పెండింగ్ పనులు పూర్తి చేసే దిశగా పాలకులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ నాయకులు ఇమరిక రామారావు, ఏపి రైతు సంఘం జిల్లా నాయకులు ఎ.ఉపేంద్ర పాల్గొన్నారు.

నిలిచిపోయిన పూర్ణపాడు-లాబేసు వంతెన పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

రాష్ట్రానికి పేరు తేవాలి

విద్యార్థులకు మంత్రి బొత్స పిలుపు • చీపురుపల్లి పాలిటెక్నిక్ కళాశాల కొత్త భవనం ప్రారంభం

పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స

ప్రజాశక్తి-చీపురుపల్లి

విద్యార్థులు బాగా చదువుకొని రాష్ట్రానికి, తల్లితండ్రులకు గొప్ప పేరు తేవాలని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. కేజీ నుంచి పీజీ వరకు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రభుత్వం రాష్ట్రంలో అత్యున్నత విద్యను అందిస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు రూ.8 కోట్లతో నిర్మించిన గద్దే బాబూరావు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి బొత్స మాట్లాడుతూ, విద్యార్థులు విద్యాభ్యాసం జరుగుతున్న సమయంలోనే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. అభివృద్ధి చెందాలనే తపన ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు . కళాశాలలో నెలకొన్న సమస్యలపై మంత్రి ప్రిన్సిపాల్ ఎల్. విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో కావలసిన మౌలిక వసతులు అంశాలపై విద్యార్థులను మంత్రి ఆరా తీసారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ అద్యాపకుల కొరతతో పాటు ల్యాబ్ సదుపాయం, ప్లేస్‌మెంటులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. స్పందించిన మంత్రి వాటికి సంబంధించిన నివేదికలను తక్షణమే తయారు చేసి తీసుకురావాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ప్రస్తుతం కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు మాత్రమే ఉన్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్, సివిల్ కోర్సులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కళాశాలకు అదనపు ఫ్యాకల్టీ, ఆఫీస్ స్టాఫ్, హాస్టల్ మంజూరు చేస్తామని, క్యాంపస్ రిక్రూట్మెంట్ సౌకర్యాన్ని పెంచుతామని చెప్పారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, కళాశాల చరిత్ర, అభివృద్ధి చెందిన విధానాన్ని వివరించారు. తన ఎంపి నిధులు రూ.10 లక్షలతో కళాశాల ప్రాంగణంలో అథ్లెటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ మాట్లాడుతూ, సాంకేతిక నిపుణులకు అపార ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, ఎంపిపి ప్రతినిధి ఇప్పిలి అనంత్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి, పలువురు విద్యార్థులు మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఆర్‌జెడి సత్యనారాయణ మూర్తి, ఆర్‌డిఒ బి. శాంతి, ఎంపిపి. ఐ.వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వి.శిరీష, తాహశీల్దర్ ఎన్.ప్రసాదరావు, ఎంపిడిఒ డి.శ్వేత, సర్పంచ్ సుధారాణి పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతో కుష్టు వ్యాధి తగ్గుముఖం

- రోగులను గుర్తించేందుకు ఎల్‌సిడిసి కార్యాచరణ
- స్వీయరక్షణ చర్యలతో వ్యాధి నివారణ సాధ్యమే
- ప్రజాశక్తితో జిల్లా హెచ్‌ఐవి, లెప్రసీ నియంత్రణ అధికారి ఎ.శ్యామ్‌కుమార్ ముఖాముఖి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

'1983లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్ఎల్‌ఎపి) ప్రారంభమైంది. నాటి నుంచి లెప్రసీ వ్యాధి బాధితులను తగ్గించడానికి కృషి జరుగుతోంది. జాతీయ ఆరోగ్య విధానం 2002 ప్రకారం జాతీయ స్థాయిలో ప్రతి పది వేల మందిలో ఒకరి కంటే తక్కువ మందికి వ్యాధి ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించి అమలు చేస్తున్నాం. పటిష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా కుష్టువ్యాధి తగ్గుముఖం పట్టింద'ని జిల్లా హెచ్ఐవి, లెప్రసీ నియంత్రణ అధికారి ఎ.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

ప్రస్తుతం జిల్లాలో ఎంతమంది కుష్టు రోగులు ఉన్నారు.?

ప్రస్తుతం జిల్లాలో 215 కుష్టు రోగులు ఉన్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఎల్‌సిడిసి పేరిట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. స్పర్శ, ఆశా వర్కర్లతో సర్వే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డిసెంబర్ 27 నుంచి జనవరి 14 వరకు చేపట్టిన ఎల్‌సిడిసిలో 33 వ్యాధిగ్రస్తులను గుర్తించాం. వారు క్రమం తప్పకుండా వైద్యులు పర్యవేక్షణలో మందులు వాడుతున్నారు.

ఈ ఏడాదిలో మీ కార్యాచరణ ఏమిటి.?

ఈ ఏడాదిలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు స్పర్శ కార్యక్రమంలో పంచాయతీ, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. కుష్టు వ్యాధి పట్ల ఉన్న అపోహలపై అవగాహన కల్పిస్తున్నాం. స్పర్శ లేని మచ్చలు, ఉబ్బిన నరాలు ఉంటే ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలి. పరీక్షలు చేసి, వ్యాధిని గుర్తిస్తే మందులు అందిస్తున్నారు.



ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో రోగుల వృద్ధి ఏ విధంగా ఉంది.?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల రోగుల సంఖ్య తగ్గుతున్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో 2022లో 196 మంది రోగులను గుర్తిస్తే, 2023లో ఆ సంఖ్య 158కి పరిమితమైంది. గుర్తించిన రోజు నుంచి రోగులకు వైద్యంతో పాటు మందులు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నాం. మల్టీబాసిల్లరీ కేసులు 12-18 నెలలు, పౌసిబాసిల్లరీ కేసులు 6 -9 నెలలు మందులు వాడాలి. వైకల్య కేసులకు శస్త్రచికిత్స, అర్హులైన వారికి పింఛను రూ.3వేలు చొప్పున ప్రతినెలా అందిస్తున్నాం.

రోగుల ఇంట్లో చిన్నపిల్లలు, ఇతర సభ్యుల పరిస్థితి ఏమిటి.?

కుష్టువ్యాధిగ్రస్తుల ఇళ్లలో చిన్నపిల్లలు, ఇతరులకు కూడా నివారణ చర్యలో భాగంగా మందులు అందిస్తాం. వారిలో కూడా లక్షణాలు ఉంటే గుర్తించి మందులు అందిస్తున్నాం.

నయం కావడానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

దేశంలో కుష్టు వ్యాధి ప్రాబల్యం పది వేల జనాభాకు 0.4గా ఉంది. ప్రతి ఏటా 14 ఏళ్లలోపు చిన్నపిల్లల్లో 6.8 శాతం ఈ వ్యాధి వ్యాపిస్తోంది. దీనివల్ల పిల్లలు జీవితాంతం అంగవైకల్యంతో బాధ పడుతున్నారు. ఈ వ్యాధి పిల్లలకు సంక్రమించకుండా, కుష్టు వ్యాధి కలిగిన వారికి వ్యాధి త్వరగా తగ్గడానికి మందులు క్రమం తప్పకుండా వినియోగించాలి. స్వీయ రక్షణతో వ్యాధిని త్వరగా తగ్గించే చర్యలు తీసుకోవచ్చు. వైకల్యం వృద్ధి చెందకుండా నిరోధించడం కోసం కుష్టు వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, మెరుగైన శస్త్ర చికిత్స చేయడం మొదటి ప్రాధాన్యతగా ఉండాలి. అప్పుడే లెప్రసీ వ్యాధి నిర్మూలన కోసం చేస్తున్న కృషి ఫలిస్తుంది.

రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న కమిషనర్ సురేష్‌కుమార్

పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం

గత ఏడాది జాతీయ స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి ఎంపికైన జమ్ము ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ ఆదివారం సందర్శించారు. జాతీయ స్థాయిలో 2021-22లో 35 పాఠశాలలను స్వచ్ఛ విద్యాలయలుగా మన రాష్ట్రం నుంచి జమ్ము ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేశారు. జిల్లా పర్యటన కోసం వచ్చిన కమిషనర్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మౌళిక వసతులు, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో ఇక్కడ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి స్వచ్ఛ విద్యాలయంగా రూపొందించడంలో కృషి చేసిన ఎం. రామ్మోహన్ రావును శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి లింగేశ్వర రెడ్డి, ఎంఇఒలు రాజు, సత్యవతి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు

కిశోర్ చంద్రదేవ్‌తో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

కిశోర్‌తో జగదీశ్వరి భేటీ

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్‌ని ఆదివారం కురుపాంలో తన కోట వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏడో తేదీన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నియోజకవర్గ పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహణ, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, బలోపేతానికి, గెలుపునకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కె.వి కొండయ్య, తెలుగు మహిళా నియోజకవర్గ కార్యదర్శి వెంపటాపు భారతమ్మ, టిడిపి నాయకులు సుభేష్ చంద్ర పండా, రామకృష్ణ, పల్లి సురేష్, బాలా, పోలూరు శ్రీను, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు పార్కులో ఉన్న అందాలను చూడటానికి జిల్లా నలుమూలల నిండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాల ఊగారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఎంచక్కగా ఆడుకున్నారు. ఆనంద విహార్ వద్ద డాన్సులు వేసి కేరింతలు కొట్టారు. అనంతరం మెట్టు గూడ జలపాతాన్ని సందర్శించారు.

అక్రమ నిర్మాణం ఆపించండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కుమిలి గ్రామంలో కోళ్లపారం యజమాని అక్రమంగా గెడ్డవాగులో నిర్మిస్తున్న ప్రహరీని రైతులు చుక్క లక్ష్మణ, గుజ్జు రాధమ్మ ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 79/5లో గెడ్డను ఆనుకొని తమ భూములున్నాయన్నారు. తమ డాక్యుమెంట్‌లో కూడా అది గెడ్డవాగుగానే రాసి ఉందన్నారు. ఆ గెడ్డవాగులు నుండి కొండల్లో నీరు రామతీర్థసాగర్ రిజర్వాయర్‌లోకి వెలుతుందన్నారు. ఇప్పుడు ఆ గెడ్డను అక్కడ కోళ్లపారం యజమాని కబ్జా చేసి ప్రహరీ నిర్మాణం చేస్తున్నాడని దీంతో గెడ్డలో నీరు తమ పొలాల్లోకి వచ్చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలు క్రితం కూడా ఇలా నిర్మాణానికి పూనుకుంటే రైతులంతా అడ్డుకున్నామని గుర్తు చేశారు. అప్పుడు వదిలేసి మరలా ఇప్పుడు అక్రమ నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నాడన్నారు. రెవెన్యూ అధికార్లు స్పందించి అక్రమ నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల వసతి గృహంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోనూ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వసతి గృహం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 23వ తేదీలోగా ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు 5వ తరగతిలో ప్రవేశాల కోసం మార్చి 10వ తేదీన పరీక్షలు ఉంటాయని, ఆసక్తి ఉన్నవారు https://apbragcet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో గల పాల కేంద్రం వద్ద సోమవారం విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో జిల్లా అందత్వ నివారణ సంస్థ, విక్టరీ ఇంగ్లీష్ మీడియం స్కూలు యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శిబిరానికి వచ్చే వారు కచ్చితంగా ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు బుక్కు, ఫోన్ నెంబరు, రెండు జతల బట్టలు, కంచం, గ్లాసు, తీసుకుని రావాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

వైసిపి నాయకునికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని బూరిపేట సర్పంచ్ భర్త, వైసిపి నాయకుడు బూరి మధుసూదన రావును విజయనగరం తిరుమల ఆస్పంత్రిలో ఆదివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు పరామర్శించారు. శనివారం ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నేరుగా ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సుందరాడ సర్పంచ్ దిలీప్ కుమార్, సతివాడ సర్పంచ్ జానికి రామ్, గొలుగు వలస సర్పంచ్ శంకర్రావు తదితరులు ఉన్నారు.

తహశీల్దార్ హత్య దారుణం

ప్రజాశక్తి - తెర్లాం

తహశీల్దార్ రమణయ్య హత్య దారుణమని విఆర్ఒల సంఘం అధ్యఓఉలు ఎన్. నరసింహనాయుడు ఖండించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ హత్యకు కారుకులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విఆర్ఒలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యలో నిలిచిన ఇండోర్ స్టేడియం

ఇంకా..

మట్టిలోనే మాణిక్యాలు

ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు చదువుతోపాటు మంచి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యం నీరుగారుతోంది. గతంలో గుమ్మలక్ష్మీపురం, జియమ్మవలస మండలాల్లో క్రీడా పాఠశాలలు, మైదానాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఏళ్లు గడుస్తున్నా అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. మన్యం ప్రాంతంలో ప్రతిభ కలిగిన వందలాది మంది క్రీడాకారులున్నా వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో తమలోని ప్రతిభను బయటకు తీయలేక మరుగున పడుతున్నారు.

ఆల్ రౌండ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీతో విద్యార్థినులు

- కానరాని క్రీడా మైదానాల జాడ
- నీరుగారిపోతున్న లక్ష్యం
- ఏజెన్సీకే పరిమితమవుతున్న క్రీడాకారులు

విలువిద్యలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పరుగు పందెం, జావెలిన్ త్రో, షార్ట్ పుట్, విలువిద్య, ఫెన్సింగ్ వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారు. స్థానికంగా పీడీలు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ మన్య ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారు. అలాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు, ఇంకా మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురంలో క్రీడా పాఠశాలల ఏర్పాటుకు గతంలో అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఒక్కొక్క మైదానానికి ఆరు ఎకరాల స్థలంలో కోటి 60 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు. కానీ నేటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. స్థల సేకరణతోనే సరిపెట్టి చేతులు దులుపుకున్నారు. మరోవైపు గుమ్మలక్ష్మీపురంలో నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులు ఐదేళ్లుగా మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారు.

జాతీయస్థాయిలో రాణిస్తున్నా..

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో విద్యార్థులు గత కొన్నేళ్లుగా క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణిస్తున్నారు. మట్టిలో మాణిక్యాలుగా గుర్తింపు పొందుతున్నారు. కురాసింగి గ్రామానికి చెందిన కరాటే క్రీడాకారిణి తోయక శిరీష శ్రీలంకలో సైతం మంచి ప్రతిభను కనబరిచి దేశానికే గుర్తింపు తీసుకువచ్చింది. కొత్తగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థి మండంగి శేఖర్ ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో కాంస్యం పతకం సాధించాడు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నాడు. ఇదే పాఠశాలలో చదువుతున్న మండంగి శ్యామ్ సుందర్ జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. భద్రగిరి పిటిజి పాఠశాల విద్యార్థులు జోనల్ పోటీల్లో ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. క్రీడా శిక్షణ నిరంతరం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా మన్యం విద్యార్థులు రాణించడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

అధికారుల ప్రోత్సాహం అంతంత మాత్రమే....

క్రీడా పోటీల సమయాల్లో తప్ప మిగతా రోజుల్లో ఐటిడిఎ అధికారులు, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అంతంత మాత్రంగానే ఉంది. వారికి సరైన ఆధునిక పరికరాలు లేకపోవడంతో స్థానికంగా శిక్షణ నామమాత్రంగానే అందుతోంది. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న ఆ ప్రతిభ స్థానికంగానే ఉండిపోతుంది. 100 మందిలో ఒక విద్యార్థి మాత్రమే ఉత్తమ క్రీడాకారునిగా గుర్తింపు పొందుతున్నారు. మిగతా వారిలో ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం లేక మన్యంలోనే ఉండిపోతున్నారు.

సాధనకు మైదానం అవసరం

గుమ్మలక్ష్మీపురంలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేసి ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తప్పనిసరిగా శిక్షణ అందించాలి. క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం, శిక్షణ లేకపోవడంతో ఉన్నత స్థాయికి చేరుకోలేకపోతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

- మండంగి శేఖర్, గిరిజన క్రీడాకారుడు

మెరుగైన శిక్షణ ఇవ్వాలి

ఏజెన్సీలో ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన శిక్షణ కరువైంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తే మంచి క్రీడాకారులు తయారవుతారు. అధికారులు స్పందించి క్రీడా పరికరాలు మంజూరు చేయాలి.

- కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

ఘనంగా వ్యాకులమాత యాత్ర

ప్రజాశక్తి-కొత్తవలస

రోమన్ కేథలిక్ లు అమితంగా పూజించే కొండడాబా వ్యాకులమాత జాతర ఆదివారం ఘనంగా జరిగింది. కొత్తవలస మండల కేంద్రానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో కొండడాబాలు వద్ద వెలసిన వ్యాకులమాత పుణ్యక్షేత్ర యాత్ర మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. శనివారం నుంచి భక్తులు లక్షలాదిగా వచ్చారు. రెండు రోజులు జరిగే ఈ యాత్రకు భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచే కాక, ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. కొండడాబాలు విచారణ కర్త గొంగాడ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, జాతర ప్రాంగణంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. శనివారం విశాఖపట్నం జ్ఞానాపురం నుంచి మహా పాదయాత్ర ప్రారంభమైంది. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి యాత్రికులు కొండకు చేరుకున్నారు. గురువులు జొన్నాడ జాన్ ప్రకాష్, కోన జయరాజు, డాక్టర్ మల్లవరం ప్రకాష్, జొన్నాడ జాన్ ప్రకాష్, చిటికెల రాజ్‌కుమార్ ఆధ్వర్యాన పూజలు నిర్వహించారు. జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, ప్రశాంతంగా నిర్వహించడానికి 150 మంది పోలీసు సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ వి. చంద్రశేఖర్ తెలిపారు.

కొండపైకి వెళ్తున్న యాత్రికులు

కోతకు గురైన రహదారి ఇదే

పడి.. లేస్తూ.. ప్రయాణం

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని నంద పంచాయతీ పరిధిలోని ఎన్.బొడ్డవలస ప్రధాన రహదారి రెండున్నరేళ్లుగా కోతకు గురైంది. ఈ రహదారిని కనీసం ఎవరూ పట్టించుకోవడం లేదు. నంద వారపు సంతకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. ఎదురెదురుగా వాహనాలు వస్తే అందులో ఎవరో ఒకరు గోతిలో పడాల్సిందే. నిత్యం అదే రహదారిలో పడుతూ, లేస్తూ ప్రయాణం సాగించాల్సిన గత్యంతరం ఏర్పడిందని ఆ ప్రాంత గిరిజనులు వాపోతున్నారు. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మెగా కాదు.. దగా డిఎస్‌సి

ప్రజాశక్తి -భామిని

ఇటీవల ప్రకటించింది మెగా డిఎస్‌సి కాదని, దగా డిఎస్‌సి అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ విమర్శించారు. ఆదివారం భామినిలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ వర్గ ప్రజలు కూడా ప్రశాంతంగా బతికే పరిస్థితి లేదన్నారు. పాలకొండలో రోడ్లు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా కనీసం ఈ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా హెల్త్ క్లినిక్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కంబర గ్రామంలో వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఉపాధి హామీ, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.17.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. 95 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. వైరింగ్, విద్యుత్తు పరికరాలు అమర్చాల్సి ఉందని తెలిపారు. మిగిలిన పనులు పూర్తయిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నటు చెప్పారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్

10న ప్రజ్ఞా వికాస పరీక్ష

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల పదో తేదిన ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు, మండల కార్యదర్శి గంగారావు తెలిపారు. తాడికొండ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం విద్యార్థులతో వారు మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థులకు చాలా కీలకమన్నారు. అటువంటి కీలకమైన పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిళ్లకు, భయాందోళనకు గురికాకుండా వారిలో ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు ఈ నెల ఏడో తేదిలోపు రూ.30 ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 93475 33088, 88971 91541 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బి.అనిల్, ఎం.అనిల్, నవీన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రం వీరఘట్టంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా గృహాలకు ఆనుకుని విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ చేపడు తున్నారు. ఆ సమయంలో పొరపాటున వైర్లను తాకితే చూస్తుండగానే ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీనిపై విద్యుత్తు శాఖ అధికారులు చొరవ చూపి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గృహాలకు ఆనుకొని ఉన్న విద్యుత్తు తీగలు

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జోగారావు

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం పట్టణంతోపాటు మండల పరిధిలో టిడిపికి చెందిన పులువురు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైసిపిలో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యక్రమంలో కౌన్సిలర్ రణబీర్ చిన్నంనాయుడు, అడ్డాపుశిల సర్పంచి రామోలు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఐక్యంగా కష్టపడి వచ్చే ఎన్నికల్లో వైసిపి అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతిఒక్కరికీ వైసిపిలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.

రైల్వే కూలీలతో సిరిసహస్ర

విజయనగరం టౌన్ : విజయనగరం ఈస్ట్ కోస్ట్ రైల్వే స్టేషన్ ఆవరణలో పని చేస్తున్న రైల్వేకూలీల కష్ట సుఖాలను చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర తెలుసుకున్నారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో కలిసి వారితో పాటు టిఫిన్లు చేశారు. వారి సమస్యలు విని వైసిపి రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్ చిన్న శ్రీను దృష్టికి తీసుకు వెళ్తానానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తోట వాసు, జాకీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి

పార్టీ నాయకులతో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి

ప్రజాశక్తి-మక్కువ

వైసిపి చేతిలో ప్రజలు మళ్లీ మోసపోవడానికి సిద్ధంగా లేరని టిడిపి సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం మండలంలోని చెముడు గ్రామంలో ఆమె ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర ఆసరా కార్యక్రమంలో మహిళలకు అబద్ధాలు చెబుతూ, తెలుగుదేశానికి ఓటేయొద్దని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఏ పార్టీకి ఓటు వేయాలో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈసారి రాజన్నదొరతో పాటు వైసిపి ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు వేణుగోపాల్ నాయుడు, ఎం.ప్రసాద్‌రావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంపత్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న బాల్యమిత్రులు

బాల్యమిత్రుడి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ఎంఇఒ కార్యాలయంలో పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన నులకజోడు సంపత్‌కుమార్‌కు బాల్యమిత్రులు ఆర్థిక సాయం చేశారు. 1987-88లో పదోతరగతి చదువుకున్న బాల్యమిత్రులు అందరు కలిసి రూ.39 వేలను సంపత్ కుమార్ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు డర్రు సత్యం, నత్తల రాజు, వాసు, నత్తల కళ్యాణ్ ప్రసాద్, వి.ప్రశాంత్ పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం

ప్రజాశక్తి-వీరఘట్టం

వైసిపి ప్రభుత్వం దళితులకు తీవ్ర అన్యాయం చేసిందని టిడిపి ఎస్‌సి సెల్ పట్టణ అధ్యక్షులు రాయిపల్లి రత్నాకర్ రావు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం దళితులను నమ్మించి మోసం చేసి, దాడులకు తెగబడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితుల సంక్షేమం కోసం ఉన్న 27 రకాల పథకాలను రద్దుచేసిందన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ నిధులను దారి మళ్లించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు డి.మాణిక్యరావు, ఎస్ శశిభూషణరావు, ఎన్.అరుణ్ కుమార్, కళ్యాణ్, డి.రాజ్ కుమార్, కె.పైడిరాజు, బి.అశోక్, డి.ఆనందరావు, పి.చిన్నారావు పాల్గొన్నారు.

6న హుస్సేన్‌పురంలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో ఈ నెల ఆరో తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎస్.సాల్మన్ రాజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైద్య, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, విధిగా హాజరుకావాలని ఆదేశించారు.